# ముష్టిపిల్ల

శ్రీ వాద్రేవు జోగిపంతులుగారు

మండు వేసంగి. మధ్యాహ్న సూర్యుడు మానవుల నడినెత్తి మీని కెక్కి ప్రళయతాండవం చేస్తున్నాడు. రోడ్డుమీద జన సంచారం సూర్యుని ప్రతాపాగ్నికి భయపడో ఏమో అరుదుగావుంది. ఫ్యాక్టరీ గొట్టం అప్పుడే పన్నెండు కూత కూసింది. కూలీలొక్కరొక్కరే ఆవురావురుమంటూ బయటికి వచ్చి చెట్ల నీడలను కూర్చుని కష్టసుఖాలాడుకుంటూ ఆకలి దేవతకి నైవేద్యాలిస్తున్నారు. ధనవంతులు సుఖంగా భోంచేసి టేబిల్ ఫాన్ ప్రక్కన పెట్టుకుని హాయిగా నిద్రచిత్తగిస్తున్నారు.

ఆ సమయంలో జమీందారు నారాయణబాబు భవనం గేటుముందు నిలబడి ఒక అనాథ బాలిక—పదిహేను పదహారేళ్లుండొచ్చు—సహృదయుల హృదయం కరిగేటట్లు తన ఆకలి బాధనంతనీ వెళ్లబోసుకుంటూ కాని డబ్బియమని ప్రార్థిస్తూంది. దర్వాన్ పోపొమ్మని అదిలిస్తున్నాడు. జమీందారు ధార్మిక బుద్ధికలవాడని తెలిసుండటంచేత ఆమె మాత్రం అక్కణ్ణుంచి కదల్డంలా. ఇంతలో దివాన్ రామ్‌శాస్త్రి కారు గేటుముందాగింది. అతడు కారు దిగి లోపలికి పోబోతూ ఆమెను చూసి అలాగే నిర్జీవ ప్రతిమల్లే నిల్చుండిపోయాడు. చూస్తూన్న కొద్దీ మతిపోతూందాతనికి. తీర్చి దిద్దినట్లుండే ఆ పెకను బొమలు, మిలమిలలాడే ఆ నల్లని కళ్లు, ఆ ముక్కుతీరు, కొట్టొచ్చినట్లుండే ఆమె సౌష్టవం పౌర్ణమినాడు మబ్బుచాటునుండి తొంగి తొంగి చూసే శశాంకునిలాగా, చిరిగిన గుడ్డల్లోంచి కనబడే మిసమిసలాడే ఆమె దేహం ఇవన్నీ చూసే వరకు కామాంధకారం అతని కనుగప్పింది. దివాన్ శాస్త్రికి రేపోమాపో అరవయ్యోపడి ప్రవేశించనుంది. అయినా "తాతా! పెళ్లాడతావా?" అంటే "పిల్లనిచ్చేవారెవరు?" అంటాడేగాని "నాకు పెళ్లెందుకు?" అని అనడనే సామెతలాగా శాస్త్రికి తల నెరసినా కామతృష్ణ ఇంకాపోలేదు. మంచి మాటల్తో ఈమెను లోబరచుకోవాలని నిశ్చయించుకున్నాడు. కొంచెం చిరునవ్వు ముఖంపెట్టి, "అమ్మాయీ! నేను లోపలికి వెళ్లి ఇప్పుడే వస్తాను. ఇక్కడనేవుండు."అని శాస్త్రి లోపలికి వెళ్లిపోయాడు. శాస్త్రి ఎంతటి దయార్ద్రహృదయుడో అనుకుంది పాపమా ముష్టిపిల్ల లోకంలో పయోముఖ విషకుంభాలుంటారనేటంత వరకు విస్తరించలేదింకా ఆమె విజ్ఞానం. కొద్ది సేపట్లోనే శాస్త్రి తిరిగివచ్చి ఆమెను కారులో ఎక్కమన్నాడు. ఆమె ఎక్కింది. కారు తిన్నగా పోయి శాస్త్రి ఇంటిముందాగింది. శాస్త్రి ఇంట్లో అతను అతని కుమారుడు, వంటలక్క తప్ప మరెవరూ లేరు. భార్య నాల్గేళ్ల క్రితమే చనిపోయింది. శాస్త్రి సరాసరి ఆమెను మేడమీదికి తీసికొని పోయాడు. వంట మనిషిని పిలిచి ఈమెచే స్నానం చేయించి మంచి బట్టలు కట్టబెట్టమని ఆజ్ఞాపించాడు.

శాస్త్రి ఆమెను మెప్పించటానికి ఇన్ని చేస్తున్నా అమాయిక ఈ చర్యలోని అంతరార్థాన్ని గ్రహించలేకపోయింది. శాస్త్రి ఆమెకు కడుపునిండా భోజనం పెట్టించాడు. ఆమెను తన గదిలోకి పిలిపించి కూర్చోబెట్టాడు. "మీరు అనాథబాలికనైన నా పట్ల యింత ఆదరం చూపించి కడుపునిండుగా భోజనం పెట్టినందుకు కృతజ్ఞురాల్ని. మీ ఋణం ఏలా తీర్చుకోవాలో నాకర్థం గావడంలేదు. శెలవిప్పిస్తే ఇంక వెళ్లొస్తా" నంది లేస్తూ. "ఆ! వెడుదువుగానిలే! కాసేపు విశ్రాంతి తీసుకో, పాపం! ఎండనక వాననక వీధి వీధి తిరిగావు!" అన్నాడు లేని దయ తెచ్చుకుంటూ. ఇంక ఆలస్యం చేయకూడదనుకొన్నాడో ఏమో లేచి ఆమె ప్రక్కగా సోఫాలో కూర్చున్నాడు. ఆమె కొంచెం ప్రక్కకి జరిగింది. అతనూ జరిగాడు. అతను లేచి ఆమె రెండు చేతులూ పట్టుకొని బలవంతం చేయసాగాడు. ఆమె "ఓరీ! తుచ్ఛుడా! ఇంత సేపట్నుంచీ నన్ను ఆదరించిందిందుకా? అమాయిక హృదయంతో నీ తుచ్ఛపు ఉద్దేశాన్ని కానుకోలేక పోయాను" అంది ఉక్రోషాన్ని వెల్లడిస్తూ. అతను

## ముష్టి పిల్ల

"లేకపోతే! నీ యబ్బసొమ్మనుకున్నావా? ఊరికే పెట్టడానికి? నీ వల్ల తగినంత పొందడానికి కాక పోతే?" వికృపు నవ్వు నవ్వుతూ, "తలుపులన్నీ ముందుగానే బిడాయించా. నువ్వెంత పెనుగులాడినా లాభంలేదు, రా! పెడసరం కబుర్లు మాను నిన్ను ఈ గృహానికి రాణీని చేస్తా. లేదన్నావా నీకిక్కడే మరణం" అన్నాడు. భయంతో ఆమె వణకిపోతోంది. అతడు తన పశుబలాన్ని ప్రయోగిస్తున్నాడు. ఎంత పెనుగులాడినా ఆమె అబల. గత్యంతరం లేక ఆమె ప్రక్కనున్న పువ్వుల కుండీ ఎత్తి అతని నెత్తి మీద ఒక పెట్టు పెట్టింది. దాంతో దివాన్ శాస్త్రి నిలువునా కూలిపోయాడు. ఆమె తలుపులు తెరచుకుని వేగంగా రోడ్డు వెంబడి పరుగులెడుతోంది. ఒంటి నిండా రక్తపు మరకలతో పరుగెడుతూన్న ఆమెను అనుమానించి బంధించారు పోలీసులు. శాస్త్రిని హాస్పటల్లో చేర్చారు. శాస్త్రి ఇక బ్రతకడం కష్టమన్నారు డాక్టర్లు. "ఆమె తప్పేమీ లేదు. కామాంధకారంలోపడి ఆమెను చెరచడానికి సిద్ధపడ్డాను. ఆమె నాకు తగినట్లుగా బుద్ధి చెప్పింది. ఆమె సుశీల. ఆమెను వదలండి. నా కుమారుడు వెంకట్రావుకిచ్చి ఆమెను పెళ్లి చెయ్యండి" అని మరణ వాఙ్మూలం వ్రాసి ఇచ్చాడు శాస్త్రి. "మానరక్షణ కోసం చేసిన పని ఇది" అని మేజస్ట్రేటు ఆమెను విడుదల చేశాడు. నలుగురి సమక్షాన బిక్షుకి కన్య—కాదు! కాదు!!—గౌరి వెంకట్రావుల కిద్దరికీ వైభవంగా వివాహం జరిగింది.

---

## పారిశ్రామిక విద్యాలయము: ఆంధ్ర మహిళాసభ

ఉచిత వేతనములు

1. నేతపరిశ్రమలో తర్ఫీదు గోరువారికి మాసమునకు రూ. 5-0-0 ఉచిత వేతన మివ్వబడును.

11. అట్టి వేతనములును గోరువిద్యార్థినులు.
   - (1) ఈ ఊరువారుగా నుండవలెను.
   - (2) ఆంధ్ర యువతులుగా నుండవలెను.
   - (3) వయస్సున 17 వ సంవత్సరములు దాటినవారుగా నుండవలెను.
   - (4) మంచి ఆరోగ్యము గలవారుగా నుండవలెను.
   - (5) 3 సంవత్సరములు వీడక విద్యనభ్యాసించువారుగా నుండవలెను.
   - (6) మధ్యలో విద్యాభ్యాసన వీడిన, పుచ్చుకున్న వేతనమును తిరిగి యిచ్చివేయుటకు సిద్ధులైయుండవలెను.

111. అట్టి వేతనములు నల్గురు యువతులకు యివ్వబడును.

IV. ఒక్కొక్క వేతనముయొక్క కాలపరిమితి 3 సంవత్సరములు.

కరెస్పాండెంటు